


# కన్నె మనసు

కథానిక

పిల్లను చూసుకోవడానికి పిల్లవాడు రానని కబురంపించాడు. కాని ఆ పిల్లను పెళ్ళి చేసుకోవడానికి తన ఇష్టాన్ని తెలియబరచాడు. చాలా ఆశ్చర్యంగా ఉందికదూ...ఈ రోజుల్లో ఇట్లాంటి సఘటన? ఆ పేట పేటంతా ఆశ్చర్యంగా చెప్పుకున్నారు. చెప్పుకోరూమరి! వింతగా ఉన్న విషయం; అంతగా చెప్పుకోకపోతే ఎలా కుదురుతుంది? మనస్సెలా కుదుటబడుతుంది ఇదంతా ఆ పేటలోని అమ్మలక్కల నోళ్ళలోంచి మాంచి హుషారుగా పుట్టి హుటాహుటిని ఊళ్లు ఊళ్ళా ప్రాకింది. అయితే అందరూ దీనిగురించే ఆలోచించారా? లేదు. కాని కొందరు బహు తీవ్రంగా చర్చించుకున్నారు. చర్చ అనంతరం చక్కగా ఓ అభిప్రాయానికి వచ్చారు—తప్పకుండా ఏదో లోపం ఆ అబ్బాయిలో ఉండితీరాలని ఖచ్చితంగా నిర్ణయించుకున్నారు.

అయితే ఎవ్వరో పెళ్ళికుమారుణ్ణి, సత్యకాలపు మనిషిగా నిర్ణయించి, "చాలా మంచి వాడై ఉండాలి ఆ అబ్బాయి. మా రాధకు ఎంత అదృష్టం పట్టింది" అన్నారు. రాధ కీమాట ఎంతో వెగటు పుట్టించింది. ఆమె చాల ఆలోచించింది. ఎంత ఆలోచించినా ఎటూ తెగలేదు. ఆమె ఇంకా ఆలోచిస్తూనే ఉంది.

రాధ ఎర్రగా ఉంటుంది. ఆమె తల నల్లగా బాగుంటుంది. ఆమె మొగం కోలగా, ఆమె కనులు విశాలంగా ఏదో అనిర్వచనీయమైన ఆనందాన్ని ఇముడ్చుకొని ఎప్పుడూ నవ్వుతూ ఉంటాయి. చేతులు నాజూకుగా, పాదాలు చూడ ముచ్చటగా తీర్చి దిద్దబడ్డాయి. ఆమె తియ్య తియ్యగా మాట్లాడుతుంది. కమ్మకమ్మగా పాడుతుంది. అతి చురుగ్గా రకరకాల వంటలు వండేస్తుంది. ఆమె నడుస్తూవుంటే ఆ పరిసరాలు పులకిస్తాయి. ఆమె మాట్లాడుతూవుంటే అదేమిటో గాని వినేవాళ్ళే ఎక్కువగా ఉంటారు. ఆమెలో ఒక ఆకర్షణ ఉంది. అదేమిటో ఆమెకు తెలుసు. ఆ తెలుసునన్న ఆనందంతోనే ఆమె అందాల గులాబివలె నిత్యమూ ఒక వినూత్న సోయగాన్ని మోహనంగా తన మేనిపై ఆవిష్కరిస్తూంది!

ఈ సంగతి విన్నప్పటినుంచీ రాధ మనసు మనస్సులో లేదు. అతను ఎందుచేత రానన్నాడో? బహుశా అందంగా ఉండిఉండక పోవచ్చు అనుకుంది. కాని మళ్ళీ తనే, లేక మరేదైనా లోపం ఉండి ఉంటుందా? మరి... నాన్న.. ఆ అబ్బాయి చాల చక్కగా ఉన్నాడని చెప్పాడే ఆ అం. నాన్న చెప్పడానికేంలే... నాన్న యెంత మందిని అలా అనలేదు. వాళ్ళల్లో ఒక్కడైనా తనకు నచ్చాడా ఏమిటి? కాని ఆ రోజున తనకో అబ్బాయి నచ్చాడు. అతన్ని పెళ్ళిచేసుకోవాలనే అనిపించింది. అందరూ అడిగితే చిరునవ్వు నవ్వి ఊరుకుంది కూడాను. తను ఎందుచేత నచ్చలేదో? కాని ఆ మాట తను వినగానే అతనూ తనకు నచ్చనట్లే అనిపించిందేమిటి చెప్మా... అవును అలా అనిపించిందేమిటి? అతనంటే తనకేమాత్రం ఇష్టమున్నట్టే అనిపించలేదు. ఇలా ఎందుకయిందో......ఏదుకోలే. . .ఎందు కిప్పుడదంతా...కాని...ఇదేమిటి. . .ఈ గొడవేమిటి. . .

ఇంతవరకూ అంతా వచ్చి చూసి వెళ్ళారే... అలా ఇతనూ వస్తే ఏం కొంప మునిగిపోయిందేమిటి! అబ్బా...మూడకుండా యెట్లా? చూడకపోతే అసలు తృప్తేలేదు. అనుకుంది. అలా అనుకొని చిత్రంగా నవ్వుకుంది. బలేవాడిలా ఉన్నాడే అతను...పైగా బి.ఏ. ఫస్టు క్లాసులో వచ్చాడట! తెలివైనవాడే అనుకుంటాను. కట్నంకూడ వద్దనే అన్నాడట. అయితే నాన్నే—మా సరదాకోసమైనా మేం ఇవ్వక తప్పదన్నాడట. అయితే వాళ్ళనాన్నతో ఈ విషయమై నాన్న ఏదో నిర్ణయించుకొనే ఉంటాడులే. ఇంతకీ చూచుకోవడానికి రాననడమేమిటి? ఇదివరీ బాగుంది; ఇదిమరీ బాగుంది అనుకుంది.

రాధకు తలనొప్పిరాలేదు. కాని అదేపనిగా ఆ ఆలోచన ఆమెను వదలి వెళ్ళడమూలేదు. ఆమె తనతల్లికి మెల్లగాచెప్పి, అతను ఇక్కడకొచ్చేట్లు నాన్నను ఉత్తరం వ్రాయమని చెప్పమంటేనో అవును...అలాచేస్తే ఎంతో బాగుంటుంది అనుకుంది. ఆమె ఈ ఆలోచనతో తనుపడ్డ బాధంతా మరచిపోయి ఒక్కసారిగా ఇల్లంతా ఉల్లాసంగా కలయతిరిగింది. 'కాని అమ్మ కెలా ఈ విషయం చెప్పడం?' అన్న అనుమానం వెనువెంటనే కలిగి ఆమెదిగాలుగా ఒకచోట నిలుచుండి పోయింది. అమ్మకు చెప్పడానికే సిగ్గయితే ఎలా? అదేమిటీ ఇది జీవితంలో సమస్య...

రాధ—తనతల్లికే చక్కని ఉపాయాన్ని చెప్పాలని ఉవ్విళ్ళూరింది. కాని అదేమిటి తల్లి దగ్గరకు వెళ్తుంది..."అమ్మాఁ" అంటుంది... మళ్ళీ గిరుక్కున గదిలోకి వచ్చేస్తుంది. అలా రెండుమూడుసార్లు జరిగింది. అన్నిసార్లూ ఆమె కృతకృత్యురాలు కాలేకపోయింది. తల్లి 'ఏమిటే' అంది. తను ఏమీ చెప్పలేకపోయింది. అబ్బ! అమ్మకు దివ్యదృష్టి ఉండగూడదూ.... అని తన మనసులో ఏదో తెలియరాని అనిర్వచనీయమైన ఆనందంతో ఊగిసలాడింది. కాని ఈ ఇబ్బంది నెలా దాటడం?

ఆమె ఇహ ఇలా కాదనుకొన్నది. మరొక రకంగా మాట్లాడాలని అనుకుంది. ఆ రకం ఏమిటో నిర్ణయించుకోలేక పోయింది. కాని ఆమెకు కాళ్ళు నిలబడటం లేదేమిటి? ఏపని చెయ్యడానికి బుద్ధిపుట్టడంలేదేమిటి?

ఈసారి... ఆమె గట్టిగా ధైర్యంచేసింది. తల్లిదగ్గరకు జాలిగా నడచి వచ్చింది. వచ్చి... "అమ్మాఁ...నాన్న..."అని ఏదో చెప్పబోయి ఆగింది. ఆ తల్లి "నాన్నాఁ...? బజారుకు వెళ్ళారే" అంది. పాపం రాధ తనగదిలోనికి ఎందుకనో గబగబా వెళ్ళిపోయింది. ఆమె ఒకటే నలిగిపోతూంది. కాని ఈ చిన్నవిషయాన్ని తన తల్లికిదేమిటి తను ఎందుచేత చెప్పలేకపోతూంది? ఏమార్గాలూ కనిపించలేదు. అక్కడంతా ఒకలాగే ఉంది.

ఆ సాయంకాలం తను తప్పకుండా చెప్పెయ్యాలనుకుంది. ఒకసారి అమ్మ ఎక్కడుందో చూసింది. ఆమె ఏదో పనిలో చికాగ్గాఉంది. రాధ పాపం ఇప్పుడుకాదు అనుకుంది. దీర్ఘంగా ఆలోచించింది. మెల్లగా తల్లిదగ్గరకు చేరింది. ఆమెకు ఏవేవో పనులు చేసిపెడుతూన్నట్లు. అదేమిటోగాని అటూ ఇటూ తిరిగింది. ఆ చిన్నపని ఈ చిన్నపని చేస్తూ తల్లిచెవిలో ఏదో చెప్తూన్నట్టుగా "అమ్మాఁ సీతవచ్చిందేఁ" అంది. సీతకి నిరుడే పెళ్ళయింది. ఆ సీత మొగుణ్ణి ఎంచుకునే పెళ్ళిచేసుకుంది. రాధతల్లి 'సీతవచ్చిందటేఁ మొన్నగాక మొన్ననే కదే వచ్చింది? అబ్బ అస్తమానూ ఏమి తిరుగుతుందే" అంది. రాధకు తల్లిమీద విపరీతమైనకోపం వచ్చింది. "అబ్బ! అమ్మకసలు బుర్రలేదు" అనుకుంది. పాపమామె కారాత్రి నిద్రపట్టనేలేదు.

మరునాడు సీత వాళ్ళింటికి వచ్చింది. ఆమె రాధనుచూసీ చూడగానే, "ఏమే అలాగున్నావ్?" అంది. రాధ ఏమీ మాట్లాడలేదు. కాని సీతవైపు అదేమిటి అలా చూస్తుంది! సీతదగ్గర ఏమున్నదని అలా చూస్తుంది! పిచ్చిపిల్ల! సీత, జవాబు పొందకుండానే, "నాకు తెలుసు లే .. నీవెందుకలాఉన్నావో" అంది. ఆలా అని, "ఇదిగో అత్తయ్యా...మరీ...మీ రాధ... ఇక్కడిలా ఏడుస్తూందేం?" అంది. వెంటనే రాధ, "ఛీ...పోవే" అంది. అని, ఆమె తన మనసులో సీతకు వేయినమస్కారాలు పెట్టాలనుకుంది. పైకి, "అబ్బ...ఏమిటి సీతా ఇది" అంది.

సీత రాధ తల్లిదగ్గరకు పరుగెత్తి, "మీ అమ్మాయికి మొగుడు ఇష్టంలేదు" అంది గట్టిగా. రాధకు సీతను కొట్టాలనిపించింది. "అంత గట్టిగా మాట్లాడుతుందేం?...మంచిదే" అనుకుంది. "సీత వచ్చి తన కష్టాన్ని తేలిగ్గా తొలగించి పారేసింది" అని సీతను మనసులో ఎంతో కొనియాడుకొంది. సీత, రాధ తల్లికి ఏమిటో చాలా చెప్పి రాధను చాలసేపు ఉడికించి ఉడికించి ఇంటికి దారి తీసింది.

ఆ మధ్యాహ్నం రాధ తండ్రి, "పెళ్ళికొడుకే చూడ నక్కర్లేదన్నప్పుడు—మనం అతన్ని ఇక్కడకు రమ్మని ఆహ్వానించడం ఏమిటి? ఇది చాలా బాగుంది" అన్నాడు భార్యతో. ఈమాట రాధ చాటుగా విన్నది. ఆమె ఆ సమయంలో సీత ఉంటే బాగుండుననిపించింది. కాని ఆమె తండ్రి, "ఇదేమీ బాగుండలేదు...అయితే నా మాట రాధ నమ్మలేదన్నమాట! చివరకు స్వార్థం ముందు తండ్రినికూడా శంకిస్తున్నారు పిల్లలు... ప్చ్..." అని పెదవి విరచి "సరే నాకేం... రాస్తాను...ఆ తరువాత ఆ అబ్బాయిగారికే అమ్మాయిగారు అనకపోతే"...అని ఇంకా ఏదో అనబోతూ ఆయన కుర్చీలో ఆయాసంగా కూలబడిపోయారు. ఆయన కడుపులో - కూతురుమీద కోపం విపరీతంగా మండుకపోతూ ఉన్నా దాన్ని అంతకన్నా పైకి ఏమీ ప్రదర్శించ లేకపోయాడు. తండ్రి ఈ మాట ఎంత బాధతో అన్నాడో విస్పష్టంగా అర్థం అవుతూ ఉన్నా, తండ్రి జాబు వ్రాయడానికి ఒప్పుకున్నాడు కాబట్టి ఆమె ఆ ముక్కతో ఒక్కగంతు వేసింది. గబగబా తన గదిలోని అద్దం దగ్గరకుపోయి తన మొగాన్ని ఓసారి దివ్యంగా చూసుకుంది. తృప్తిగా నవ్వుకుంది. ఆమె మనస్సు యిప్పుడు ఎంతో తేలికపడింది.

ఇహ ఆ పెళ్ళికుమారుని రాకకోసం ఎదురు చూడటమే తనవంతుగా భావించింది. అతను ఎలా ఉంటాడో అన్న ఊహ, క్షణక్షణమూ ఆమెను పాపం తనదగ్గరకు లాక్కుంటూంది. ఆమెను ఓ ఆట ఆడిస్తూంది. ఆమె ఈ పుస్తకం చూస్తుంది. ఆ పెట్టె తెరుస్తుంది. ఈ మంచం మీద [illegible] సరిచేస్తుంది. ఆ కిటికీ తలు బారుగా తెరుస్తుంది. మంచంమీద పడుకొని అటూ ఇటూ కదలుతుంది. ఏమిటేమిటో ఊహిస్తుంది. మొగంలో అనేకరకాల భావప్రదర్శనల భంగిమలు క్షణక్షణమూ అద్భుతంగా మారుస్తుంది.

ఆమె ఎదలోని ఎద, "ఇదిగో రాధా,.. సరే బాగుంది కాని—నువ్వు... అతను అందంగా ఉంటేనే పెళ్ళి చేసుకుంటావనుకో... కాని ఈ అందం శాశ్వతమని ఎక్కడ వ్రాసి ఉంది? అది రేపొద్దుట శిథిలమై పోవచ్చు! అతని మొగం నిండా మశూచికం గంట్లు ఏర్పడవచ్చు!" అంది. రాధ ఒక్కసారి ఈ భావం తట్టగానే పకపకా నవ్వుకుంది. "హుఁ. ఇంత చచ్చుగా ఎవ్వరూ వూహించరు. ఇదేమివూహ! మనం చెడు జరుగుతుందని అనుకోవడమేమిటి? ఈ భవనాలు ఈ ఆనకట్టలు రేప్రొద్దుట గాలివానలొచ్చి, ఉధృతంగా వరదలొచ్చి కూలిపోతాయని కొట్టుకుపోతాయని ఇప్పుడు వాటిని బలంగా అందంగా నిర్మించడం మానుకుంటామా?" "అయితే గుణం మాట ఏమి చెబుతావు రాధా? అది నీకెలా తెలుస్తుంది?..." అంటూ ఆమె నెవరో నిలదీశారు. రాధ ఈ విషయంలో కాస్త తటపటాయించింది. కాని అందుకిలా చెప్పుకుంది, "మొగం చూడగానే ఆ విషయం తప్పక అర్థం అవుతుంది. ఆ వేళ అతనువేసే వేషంలోనూ, మాటల పొందికలోనూ తప్పక ఆ విషయం వ్యక్తం కాకతప్పదు. అన్నం అంతా పట్టి చూడలా ఏమిటి? అయినా ప్రప్రథమ వీక్షణాలలోనే మనసులు కలవొచ్చు ఆ తరువాత ప్రకృతిచేసే అపకారాల నెన్నింటినైనా చిరునవ్వుతో స్వీకరించవచ్చు" అనుకుంది.

పెండ్లి కుమారునికోసం తండ్రి స్టేషనుకు వెళ్ళాడు. రాధ ఇంటివద్ద సీతతో ఏమేమిటో మాట్లాడుతూంది. సీత అనుక్షణమూ రాధను తెగ ఉడికిస్తూంది. ఇద్దరూ ఆ ఇంటిలో పకపక నవ్వుకోవడమూ, మాటలు ముడుచుకోవడమూ, ఒకరినొకరు బతిమాలుకోవడమూ సరదాగా కొట్టుకోవడమూ చేస్తున్నారు.

"ఇదిగో రాధా! అదేమిటో చూడు; బలే గమ్మత్తుగా ఉంది" అంటుంది సీత. రాధ అటు

"అరే పాపం మీ నాన్న ఒక్కడే వస్తున్నాడేమే..." అంటుంది. తన మొగంలో ఏమాత్రం వేళాకోళపు ఛాయలు ద్యోతకం కానీయకుండా కిటికీ వద్దకు ఆశ్చర్యంగా నడుస్తూ. రాధ నిజమే అనుకుంటుంది. మెల్లిగా కిటికీవైపు చూస్తుంది. సీత విరగబడి నవ్వుతూ అక్కడనుంచి పారిపోతుంది. కోపమూ సిగ్గూ కలగలుపు చెక్కిళ్ళతో రాధ, పారిపోతూన్న సీతజడ పుచ్చుకొని, ఆమె నక్కడే ఉన్న మంచంమీద పడేస్తుంది. సీత అంతం లేకుండా వస్తున్న నవ్వు నాపలేక ఆపుతూ, "మీ ఆయన్ను కాదమ్మో" అంటూ అక్కడ నుంచి రాధను తప్పించుకుంటూ పారిపోతుంది. రాధ "అబ్బ! ఏమిటమ్మా నువ్వుమరీను" అంటుంది బుంగమూతి పెట్టి.

రాధ ఉత్సాహం, పెండ్లికుమారుని దర్శనం కోసం ఉరికే ఉరకలు వేస్తూంది. ఆమె కనుల దివ్యకాంతులు మోహనంగా వెలుగుతున్నాయి. అతను ఎట్లా ఉంటాడో అన్న ఊహ ఒకటి. తను అతనికి నచ్చుతుందో నచ్చదో అన్న ఊహ మరొకటి ఆమెను ఉరికే పీడిస్తున్నాయి. అతను వచ్చే వేళ దగ్గరపడేకొద్దీ ఆమెనెందుకనో భయం ఆవహించడం మొదలు పెట్టింది. ఆమెగుండెలు కొట్టుకోవడం మొదలుపెట్టాయి. ఇంతలో సీత అకస్మాత్తుగా వచ్చి, "వచ్చేరే" అంది. రాధ నమ్మనట్టుగా మొగం పెట్టింది. కాని ఆమెకూ అది నిజమనే తోచింది. సీత, "నిజమేనోయ్... ఊఁ... ఇంకోసారి అద్దం ముందు అందం సరిచూసుకో" అంది. రాధ, కొడతాను చూడు అన్నట్లుగా మొగం మార్చింది. ఇంతలో రాధ తల్లివచ్చి, "మీ నాన్నగారికి కాఫీ ఇద్దువుగాని రా అమ్మా!" అంది. రాధ అక్కడనుంచి కదలలేదు. సరిగదా "నే నివ్వను బాబూ!" అంది తల్లితో గోముగా.

"అదేమిటే పిచ్చితల్లీ. పోనీ ఇలా వచ్చి నిలబడూ!" అంది ఆమె. సీత, "ఊఁ...పదపద... జాగుచేస్తే అబ్బాయిగారికి ఆగ్రహం వస్తుంది. ఊఁ..." అని రాధ తలలోని పూలు సర్దుతూ ఆమె కట్టిన చీర సవరిస్తూ, ఓ చేయి పుచ్చుకొని, నిండు సిగ్గుతో అందంగా ఉన్న రాధను ఆ అబ్బాయి కూర్చుని ఉన్న గదివద్దకు నడిపించుకు

"అమ్మా!...ఇలారా" అన్నాడు తండ్రి. రాధ మెల్లగా ఆ గదిలో అడుగుపెట్టింది.

అక్కడే—ఒకించుక తలయెత్తి అర్థనిమీలిత నేత్రాలతో పరికించిన రాధకు—ఒహో! ఏమి సౌందర్యం! ఈ జగత్తులోనిఅందమంతా అతనిలో మూర్తీభవించినట్లుంది. రాధ—రెప్ప వేయలేదు. ఆమె అడుగు కదపలేదు. అతని కనులలో ఆమె కనులు నిలిచిపోయినవి. ఆమె ఎదలో అతని సౌమ్యవదనం అచ్చుపడినది. కనిపించీ కనిపించని అతని చిరునగవు ఆమెలో ఒకించుక సంచలనము కలిగించి ఆమె తలను సిగ్గులదొంతరతో ప్రక్కవాటుగా త్రిప్పినది. అంతే. మరి ఆమె అక్కడ నిలబడలేదు. తన గదిలోనికి తుర్రున పారిపోయినది. సీత, "అదేమిటేఁ అలా వచ్చేశావ్" అంది. ఆ మాట వినగానే రాధకు ఎందుకనో భయంవేసింది. సీత, "సరేగాని, నీకు నచ్చాడటేఁ" అంది; రాధ కనులలో కనులుపెట్టి. రాధ ఏమీ మాట్లాడలేదు సీత, ఆమె వైపు చురుగ్గా చూస్తూ "అమ్మ దొంగాఁ"అని కిలకిలా నవ్వింది. నవ్వి బయట గదిదగ్గరకు వెళ్ళి "పెళ్ళికొడుకుగారికి—పిల్లనచ్చినట్టేనా" అంది రాధతండ్రికామాటవినబడేట్టుగా. ఆ అబ్బాయిఏమీమాట్లాడలేదు. కాస్సేపాగి రాధ తండ్రితో, "వెళతానండి. నాన్నగారు తిరుగుబండిలో వచ్చేయమన్నారు" అన్నాడు. ముసలాయన, "ఈ వేళకుండి రేపువెళితే మా అందరకూ ఆనందంగాఉంటుంది" అన్నాడు, కాని అతను, "కాదండి... చాల జరూరు పని ఒకటి ఉందండి... వెళ్ళక తప్పదు" అన్నాడు. అంటూ, "నేనక్కడనుంచి ఉత్తరంవ్రాస్తానండీ" అంటూ వీధిలోకి దారితీశాడు. ముసలాయన నడుం ఒక్కసారిగా విరిగిపోయినట్లయింది. ఆయన కొంతదూరం ఆ అబ్బాయిని సాగనంపి ఇంటికి తిరిగివచ్చాడు.

ఇప్పుడు రాధ ఎవ్వరితోనూ మాట్లాడదు. ఆమె మనస్సంతా ఆ అబ్బాయి వ్రాసే ఉత్తరం కోసమే ఎదురుచూస్తూంది. ఇంత అందగాడు మరి తనను మొదట్లో చూడకుండానే పెళ్ళిచేసేసికుంటానని ఎలాగన్నాడో అనుకుంది.

ఈ మాట తలచుకుంటూ వుంటే, అతని విశాలగుణగణం ముందు తను ఎంతనీచంగా ప్రవ

ర్తించినట్లుంది! తండ్రినికూడా తను నమ్మలేకపోయింది. కొంపదీసి అతనికి తను-నచ్చలేదని జాబు వ్రాస్తాడేమో! ఆమె కనులు భయంతో కంపించినవి. అప్పుడే గోడనున్న గడియారం "టంగ్ టంగ్"మని గంటలుకొట్టింది. నిజంగా తను అతనికి నచ్చదా...? అంతేనా? ఆమె గడియారం వైపు చూసింది. పాపం అదేంచేస్తుంది! తనపనిని తాను నిర్వర్తించుకుంటూంది. ఇతరుల జోలికి పోదు. ఇతరుల గొడవ దానికక్కరలేదు. కాని రాధ, గడియారం అట్లా గంటలుకొట్టడం ఏదో విపత్తుకు సూచనగా భావించింది. ఇప్పుడామె గుండెల్లో దిగులు బలంగా వ్యాపించింది. పాపమామె ఏ పనీ చేయలేకపోతూంది.

వారం రోజులయినా అక్కడనుంచి జాబురాలేదు. ఆమెతండ్రి ఆ ఇంట్లో ఎవ్వరితోనూ మాట్లాడటంలేదు. ఆమె తల్లిగారి గుండెలెంతో బితుకుబితుకుమంటున్నాయి. రాధమనసు ఈ ప్రపంచంలో లేదు. సీతవచ్చి ఏవేవో కబుర్లు చెబుతుంది. ఎంతో నవ్వించబోతుంది. కాని రాధ, అసలు నవ్వంటే ఏమిటో ఎలాగుంటుందో తెలియని దానిలా నీరసంగా శూన్యంలోకి చూస్తుంది. సీత ధైర్యం చెబుతుంది. ఆమెలో మరింత అధైర్యం నిండుకుంటుంది.

ఆ వేళ ఆకసమంతా మబ్బుపట్టి ఉంది. కాని ఆ మబ్బులో—వర్షంపడే సూచనలేదు. చల్లగా గాలిమాత్రం వీస్తూంది. బాధలనుభవించే వారి ఆత్మలకు శాంతిప్రదాతగా ఉంది ఆ వాయువు. అది నిర్జీవమైన శరీరాలకు ఆయువు పోస్తూంది.

ఆమె ఎదురు చూస్తూన్న పోష్టుజవాను ఆనాడు ఆ వైపే వస్తున్నాడు. కాని ఆమె కదలలేదు వీధిగుమ్మంలోనికి ఆమె వెళ్ళనూలేదు. అతను తిన్నగా ఆ ఇంటికే వచ్చాడు. ఒక కేక వేసి ఏదో ఉత్తరాన్ని ఆ ఇంట్లో పడవేశాడు.

రాధ మెల్లగా లేచింది. ఆమె కాళ్ళు తడబడలేదు. వీధిగదిలోనికి ఏమాత్రం తొందరపాటుగాని, ఆత్రుతగాని లేకుండానే వచ్చింది. ఆ ఉత్తరం అక్కడే పడిఉంది. గాఢనిద్రలో మునిగిఉన్న అమాయకపు పసికూనవలె అదిఅక్కడఉంది. రాధ వంగిదాన్ని తీయబోతూ నీరసంగా ముందుకుతూలి పడిపోయింది. "అపశకునం... అపశకునం..." అని ఆమె మనసులో ఎవరో గింజుకున్నారు. "ఛీ...ఎందుకు ఇట్లా అనుగడుక్కీ అనుమానపు భయాలను పెంచుకుంటావు" అని వేరొకరెవ్వరో ఆమెలో ధైర్యాన్ని పోశారు. కాని పాపం రాధ ఆ బాధలోనుంచి తప్పుకో లేకపోయింది. నల్లత్రాచు పడగమీద చేయి వేస్తున్నట్లుగా ఆ ఉత్తరంమీద గజగజా వణికే చేయి వేసింది....

ఆ ఉత్తరంలో . తొలుదొల్త కనిపించని ఆ అక్షరాలను ఎన్నిసార్లు చదివింది! అబ్బ! ఆమె ఆనందానికి అంతులేదు. ఆకసంలో చిక్కగాఉన్న మబ్బుల్ని చీల్చుకొని సూర్యుడెంత చక్కగా బయటకువచ్చాడు! ఆమె ఆ సంతోషాన్ని పట్టలేక, "అమ్మా" అంటూ ఒక్కసారిగా హృదయంతో ఉరకలువేసే కంఠాన్ని—ఆ యింటి నిండా ఆ మధురశబ్దంతో నిండిపోయేట్టు సారించింది. ఆమె తల్లివచ్చి, "ఏమిటమ్మా అది?" అంది. ఆ తల్లి ఎదురుగా రాధ, తన సన్నని సుందరమైన వ్రేళ్ళ మధ్య ఉన్న ఆ అందాల లేఖను తన కళ్ళ కద్దుగా పెటుకొని, ఒక్కసారిగా తుర్రన లేచి తన గదిలోనికి పారిపోయింది.

"నేనెప్పుడో ఒప్పుకున్నాను. ఇహ...మీ అమ్మాయిదే వంతు" అని ఉన్న ఆ ఉత్తరంలోని ఆ వాక్యాల నెన్నిసార్లు చదువుకుంది! ఎన్నిసార్లు చదివినా ఇంకా చదవాలనే అనిపిస్తూంది ఆ ఉత్తరం! ఆమె పెళ్ళికుమారుని ఏవిధంగా స్మరించాలో ఊహించలేకపోతూంది "అబ్బ! ఎంత మంచివారు. ఎంత గొప్పవారు!" అనీ—మాటిమాటికీ అనుకుటూ అతని సౌందర్యపూరిత సౌమ్యవదనాన్ని కళ్ళల్లోనికి తెచ్చుకుంటూంది.

ఇంతలో సీత ఆ గదిలోనికి గబగబా ప్రవేశించి. "ఇదిగో రాధా... మీ ఆయనా, మా ఆయనా స్నేహితులేనట! ఇంతకీ మీ ఆయన ఎంత దొంగో తెలుసా? మా ఆయనతో ఈ వూరు ఓసారి వచ్చి నిన్ను చాటుగా చూశాడట. బలేవాడులే!" అంది.

రాధ ఒక్కసారిగా నివ్వెరపోయింది. పాపమామె మొగం పైకి ఎందుకనో నల్లని తెర ఒకటి [illegible]